# ఏటిలోని కెరటాలు

—జి. నరసింహమూర్తి

సంధ్యాసమయం.

గోదావరినది ప్రశాంతంగా ప్రవహిస్తూంది. గాలికి కెరటాలు ఒడ్డుకు కొట్టుకొని తిరిగి వెనకకు వెళ్ళి పోతున్నాయి. నదిలో తెరచాపలెత్తిన పడవలు ముందుకు సాగుతున్నాయి.

దూరాన పశువుల మంద దుమ్మును లేపుతూ ఊరి లోకి పరుగెత్తుతున్నాయి. వెనకాలే వాటిని తోలు కుంటూ వెడుతున్న కుర్రవాడు "ఏటిలోని కెరటాలు ఏరు విడిచి పోవు, ఎదలోని మమకారం ఎక్కడకూ పోదు" అనే పాట గొంతెత్తి శ్రావ్యంగా పాడుకుంటూ పోతున్నాడు. గాలిలో తేలివస్తున్న ఆ పాట కొన్ని క్షణాలు నన్ను నిలిపివేసింది.

ఆ పాట వింటే ఈ మానవ జీవితాలు చాలా చిత్ర మైనవిగా అనిపిస్తూవుంటాయి. జీవితంలో ఒక వ్యక్తిని ఒకసారి కలుసుకొని కొంతదూరం ప్రయాణం చేసి విడిపోయిన తరువాత, ఆ వ్యక్తిపై అదే మమకారం వుంటుందా ?

నా స్మృతిపథంలో "వీణ" మెదిలింది ... వీణను నేను గాఢంగా ప్రేమించేను... పెళ్ళి చేసుకోవాలను కున్నాను. కాని ఆమె నాకు అందకుండా దూర మైంది...

గతం కళ్ళముందు నిలిచింది.

o o o

ఆవేళ... నేను ఆఫీసుకు త్వరగా వెళ్ళేను. చూడ వలసిన కాగితాలు చాలా వుండటంవలన, అవి పూర్తి చేస్తేనే గాని రిలీఫ్ వుండదనిపించింది. కాగితాలలో మునిగివున్న నాకు—

"నమస్కారం" అన్న తియ్యని గొంతు వినిపిం చింది.

అప్రయత్నంగా తల ఎత్తి చూసేను.

మెరుపుతీగలా సన్నగా, విశాలమైన కళ్ళతో, నొక్కుల జుత్తుతో నిలబడివుందొకామె.

"నమస్కారం... మీరు" అని ఆగిపోయేను.

"నా పేరు 'వీణ'. ఈ సెక్షన్‌కు నన్ను పోష్టు చేసారు."

"అలాగా... కూర్చోండి. ఎన్నాళ్ళయింది మీ రీ ఆఫీసులో చేరి?"

"ఇప్పటికి పదిహేను రోజులైంది... ఈ సెక్షన్‌లో ఒక సీట్ వుందటగా... ఆ సీట్‌లో నన్ను పోష్టు చేసారు" అంది.

"అయితే ఈ ప్రక్కసీటు మీదే. చాలా లైట్ సీట్... ఎక్కువగా కష్టపడనవసరం లేదు" అని ఆ సీట్లో వుండే పనిగురించి అంతా ఆమెకు చెప్పాను.

"చాలా థ్యాంక్స్" అంది నవ్వుతూ।

ఆ నవ్వే నన్ను కదలించింది. 'వీణలో' ఏమైన ప్రత్యేకత అనేది వుంటే ఆమె నవ్వే అని చెప్పవచ్చు. నవ్వుతున్నప్పుడు పెదవులు రెండూ బిగబట్టి కళ్ళను తమాషాగా త్రిప్పుతూ మరీ నవ్వుతుంది.

ప్రక్కసీటే కాబట్టి ఆమెతో నా పరిచయం ఎక్కువ కావడానికి ఎన్నో రోజులు పట్టలేదు. ఎందుకో కొంద రిని చూడగానే మనస్సులో తెలియని ఆత్మీయతను పెంచుకుంటాం.

అలాగే 'వీణ' అంటే నాకు చెప్పలేనంత ఇష్టంగా మారింది. అందుకే ఆమెపట్ల ఎప్పుడూ చాలా ఆత్మీ యంగా వుండేవాడ్ని. ఆమె కూడా మనస్సు విప్పి మాట్లాడేది. వీణని చూడకపోతే నాకు తోచేది కాదు. ఆకస్మికంగా నాకు దొరికిన పెన్నిధి 'వీణ'. వీణ సన్నిధిలో రోజులు క్షణాలుగా మారిపోయాయి.

ఒకరోజున అన్నాను.

"ఈవేళ మీ యింటికి వస్తాను, మీవాళ్ళను పరి చయం చేసుకుంటాను" అని. మావాళ్ళ నెదిరించైనా వీణని పెళ్ళిచేసుకుందామన్న నిశ్చయం పెరిగింది. ఈ విషయం చెప్పడానికి, ఆఫీసవుతూనే వీణను గార్డెన్స్‌కు తీసుకువచ్చాను.

"మా యింటికా?" ఆశ్చర్యంగా చూసింది.

"ఏం? రావద్దా?" కొంటెగా అన్నాను.

"వద్దు" అంది.

నేను దెబ్బతిన్నట్లు ఫీల్ అయ్యేను.

నెమ్మదిగా "క్షమించండి... ఎప్పుడో ఒకరోజున నేనే తీసుకొని వెడతాను. అంతవరకు ఓపికపట్టండి" అంది.

నేను ఏమి మాటాడలేదు. వీణ ఎందుకంత నిర్లి ప్తంగా ఉందో నాకు అర్థం కాలేదు. ఆమె ఫామిలీ విషయాలు నాకు తెలియనివి కావు. వాళ్ళ కులం వేరు. ఆమెకు తల్లితప్ప మరో దిక్షత లేదు.

వీణ. అస్తమిస్తున్న సూర్యుని వంక చూస్తోంది... నాకు ఒకటే ఆశ్చర్యంగా వుంది. ఆమె వుదయం నుండి మౌనంగానే వుంది. పలకరిస్తేనే గాని మాట్లాడే టట్లు లేదు.

"వీణా"

"ఏమిటండి"

"ఈవేళ నీ పుట్టినరోజు అన్న సంగతి కూడా మర్చిపోయావా ?"

"............"

"దేనికంత పరధ్యానంగా వున్నావు వీణా ! ఉద యంనుండి చూస్తున్నాను, అసలు నీవు ఏదో ఆలో చిస్తూ ఈ లోకంలో లేనట్లుగానే వున్నావు. నిరుడు ఇదేరోజు ఎంత హడావిడి చేశావో గుర్తుందా ? అటు వంటిది ఈవేళ నీవు ఇలా వున్నావంటే ఏదో కారణం వుండాలిగా."

"ఏమిలేదండీ బాగానే వున్నానుగా" అంది లేని నవ్వు తెచ్చుకుంటూ.

"నాకయితే అలా అనిపించడంలేదు వీణా ! గల గలా పారే సెలయేరు ఒకసారి ఆగినట్లుగా వుంది..."

రాబోతున్న కన్నీటిని బలవంతంగా ఆపుకుం టూంది.

"వీణా ! ఏమిటిది ? ఏమైంది" అన్నాను దగ్గరగా జరుగుతూ.

కొన్ని క్షణాలు ఏమి మాట్లాడలేదు. తరువాత కళ్ళు తుడుచుకుంటూ నవ్వింది. "ఏదో జ్ఞాపకానికి వచ్చింది... అందుకే అలా అయిపోయేను భాస్కర్... క్షమించండి" అంది.

"అంతే కదా! అసలు నీతో ఎన్నో విషయాలు చెప్పాలని అనుకున్నాను. కాని నీ మూడ్ బాగాలేదు."

"ఫర్వాలేదు చెప్పండి" ఎటో చూస్తూ అంది.

"వీణా ! నేనంటే నీకు ఎటువంటి అభిప్రాయం వుంది?"

"అంటే"

"డొంకతిరుగుడుగా మాట్లాడటం నాకిష్టం లేదు వీణా! నిన్ను నేను పెళ్ళిచేసుకుంటాను. నీకిష్టమేనా?"

ఆమె దూరంగా వున్న పూలచెట్ల వంక చూస్తోంది. ఆమె సమాధానంకోసం ఎంతో ఆతృతగా నేను ఎదురు చూస్తున్నాను.

"క్షమించండి భాస్కర్... అది అసాధ్యం" అంది.

'వీణా' గట్టిగా అరవాలనుకొని అరవలేకపోయేను. నా కళ్ళముందు వున్న తెరలన్నీ విడిపోతున్నాయి... నా అంచనా తప్పు అని నేను నిర్ణయించుకోలేకపోతున్నాను...

"భాస్కర్ నాకున్న స్నేహితులలో మీరు మంచివారని నమ్మాను. కాని మీరు కూడా నన్ను సరిగా అర్థం చేసుకోలేకపోయారు."

"వీణా" అన్నాను బాధగా.

ఆమె ఏమి మాట్లాడలేక తలవంచుకుంది. ఆమె బుగ్గలపై కన్నీళ్ళు జారుతుంటే నాలో ఎంతో మనస్తాపం కలిగింది.

అయితే ఆమెకు అటువంటి ఉద్దేశం లేదా? నేను పొరపాటు పడ్డానా?

"సారీ వీణా! నీ మనస్సు తెలియక ప్రవర్తించేను. నీ హృదయాన్ని గాయపరిచాను. అందుకు ఇప్పుడు నీవు ఏవిధంగా శిక్షించినా అనుభవించడానికి సిద్ధంగా వున్నాను."

నావంక అమాయకంగా చూసింది.

"........."

"వీణా! ఒక విషయం తెలుసా! ప్రవాహవేగంలో ఎక్కడనుండో రెండు పువ్వులు ఒకదానికొకటి పెనవేసుకొని అలలపై తేలియాడుతూ వస్తూవుంటాయి. విచిత్రమేమంటే ఏ కెరటాల తాకిడికి అవి దగ్గరై ప్రయాణం చేస్తున్నాయో, అవే కెరటాల తాకిడికి మరలా విడిపోవచ్చుగా. అలాంటిదే మన జీవితం కూడా! అని అనుకుంటాను."

అంతకంతకు ఆమె ఏడుపు ఎక్కువ అవుతోంది.

"ఊరుకో వీణా!"...

కొన్ని క్షణాల నిశ్శబ్దం తాండవించింది మా ఇద్దరి మధ్య.

"మీరు నాలో ఏంచూసి అలా అడగగలిగేరు భాస్కర్" అంది నెమ్మదిగా తలఎత్తి.

"వీణా! నిజం చెబితే నమ్ముతావా! ఒకవిధంగా నీ నవ్వే నన్ను పిచ్చివాడ్ని చేసింది. వెన్నెలలాంటి అమాయికమైన నీ నవ్వే నన్ను నీ దగ్గరకు వచ్చేటట్లు చేసింది. ఆ నవ్వునే నేను శాశ్వతం చేసుకొని నా జీవితమనే నందనవనంలో నిరంతరం కురిపించుకోవాలనుకొన్నాను. కాని అది భ్రమ అని తేలిపోయింది."

"భాస్కర్... నన్ను క్షమించలేరా! మీరంటే నాకెప్పుడూ చెప్పలేని మమకారం వుంది. ఎలా చెప్పాలో నాకే తెలియడంలేదు. కాని ఎందుకో మిమ్మల్ని పెళ్ళి చేసుకోలేను. ఆ ఆలోచన నా కెప్పుడూ రాలేదు. జీవితాంతం మిమ్మల్ని నా గుండెల్లో దాచుకోగలను గాని, పెళ్ళి చేసుకోలేను. వస్తాను భాస్కర్" అంటూ పరుగెత్తినట్లుగానే వెళ్ళిపోయింది.

పిచ్చిగా ఆమె వెళ్ళినవేపే చూశాను. ప్రకృతి అంతా నన్ను చూసి పరిహసిస్తున్నట్లుగా వుంది. జీవితంలో ఇంత పెద్ద ఓటమి ఎప్పుడూ చవిచూడలేదు. నేను అనుకున్నది ఏమిటి? జరిగినది ఏమిటి?...

కొద్దికాలంలోనే

నేను ఆ ఆఫీసులో రిజైన్ చేయడం. కాలేజీలో లెక్చరర్ పోస్టు వస్తే చేరడం. తల్లిదండ్రులు తెచ్చిన సంబంధం ఒప్పుకోవడం; పెళ్ళి అవడం అన్నీ ఒకదాని తరువాత ఒకటి వరసగా జరిగిపోయాయి.

కాలచక్రంలో ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి.

o o o

ఇల్లు చేరుకోగానే ఒక శుభలేఖ, ఉత్తరం అందించింది నా శ్రీమతి.

'చక్రవర్తి' - పెళ్ళికి తప్పక రావలసిందంటూ వ్రాసిన వుత్తరం అది. అక్షే అది. మర్నాడే హైద్రాబాద్ బయల్దేరాను. వాడు నన్ను చూడగానే చాలా ఆనందించేడు. చిన్నప్పటినుండి కలిసి చదువుకున్నాం. రిజర్వ్ బ్యాంకులో ఉద్యోగం వచ్చిన తరువాత తనకు ఇష్టమైన అమ్మాయి దొరికేవరకు పెళ్ళిచేసుకోలేదు. ఇప్పుడు ఏరికోరి చేసుకుంటున్నాడు.

పెళ్ళిలో అనుకోకుండా వీణ కనిపించింది.

"వీణా! నువ్వా?...ఇక్కడా!" నాలో ఆశ్చర్యం పెరిగిపోతోంది.

"నేనే... ఇది మా పిన్నిగారిల్లు... పెళ్ళికూతురు నా కజిన్‌సిస్టర్ 'రత్నమాల'... మీరు పెళ్ళికొడుకుకు ప్రాణస్నేహితులని తెలుసు... అందుకే ఎప్పటినుండో మీకోసం ఎదురుచూస్తున్నాను... రండి అలా తోటలో కూర్చొని మాట్లాడుకుందాం... పెళ్ళికి ఇంకా చాలా టైం వుందిగా" అంది.

నేను ఆమెను అనుసరించేను. ఇద్దరం సన్నజాజి పందిరివద్ద వున్న సిమెంట్ బల్లపై కూర్చున్నాం...

వెన్నెల వెలుగులో వీణ మరింత అందంగా కనబడుతోంది. ఆమె కళ్ళలో కనబడుతున్న ఆనందం నాకు స్పష్టంగా గోచరిస్తోంది.

వీణ నెమ్మదిగా అంటోంది "నిజంగా! ఇన్నేళ్ళ తరువాత మిమ్మల్ని ఇక్కడ ఇలా కలుసుకుంటానని అనుకోలేదు భాస్కర్... అది సరే గాని పెళ్ళికి మీరు ఒక్కరే వచ్చారే... పద్మను, బాబును తీసుకొని రావలసింది."

నేను ఆమెను చూడగానే మూగపోయాను. ఇన్నాళ్ళకు కలుసుకున్నామనే ఆనందంతో ఏమి మాట్లాడలేకపోతున్నాను. అందులో నేను ఆనాడు అలా వెళ్ళిన తరువాత ఆమెను కలుసుకోవడానికి కూడా ప్రయత్నం చేయలేదు. కనీసం నా పెళ్ళి శుభలేఖ కూడా ఆమెకు ఇవ్వడానికి నా మనస్సు అంగీకరించలేదు. ఆమెలో అనురాగం వుండవచ్చు. అంతకు మించి అహంభావం కూడా వుందనిపిస్తోంది. అందుకే నేను ఆమెకు చాలా దూరం అయ్యేను. కాని నా విషయాలన్నీ ఆమెకు ఎలా తెలుసు అన్నది ప్రశ్న... వెంటనే అడిగేశాను.

"నా భార్యపేరు పద్మ అని... నాకు బాబు అని నీకెలా తెలుసు వీణా"

"అనురాగపూరితమైన హృదయాలు ఎంతదూరంలో వున్నా ఒకేలా పనిచేస్తాయి భాస్కర్... ప్రయత్నిస్తే ఒకరి విషయాలు మరొకరికి తెలియకపోవు. కాని నాపై మీకు చాలా కోపం వుందని తెలుసు... అది నా దురదృష్టం...కొన్ని విషయాలలో విధిని మనం నిందించుకోవలసిందే గాని ఏమీచేయలేం..."

"పోనీలే వీణా! గడిచినదానికి నేను ఎప్పుడూ బాధపడటములేదు. అవన్నీ ఆనాడే మర్చిపోయాను... జీవితంలో అందరూ అదృష్టవంతులు కాలేరు"...

మౌనంగా తలవంచుకొని కూర్చొంది. ఎప్పటి నుండో నా మనస్సులో దొలుస్తున్న ప్రశ్న...అడగాలా వద్దా అని ఆలోచిస్తున్నాను. ఆమెను పరీక్షగా చూస్తుంటే 'ఆ చిహ్నాలు' ఏమీ కనబడటంలేదు. అందుకే నెమ్మదిగా అడిగేను "వీణా! నేను ఒకటి అడుగుతాను ఏమి అనుకోవుగా."

'ఏమిటో అడగండి' అంది నవ్వుతూ. ఆ నవ్వులో జీవం లేదు. మీరు అడిగేది ఏమిటో నాకు తెలుసు అన్నట్లు వున్నాయి ఆమె కళ్ళు.

"నీవు ఇంకా పెళ్ళిచేసుకోలేదా;"...

"లేదు" అంది నిర్లిప్తంగా...

"అదే ఎందుచేత అని అడుగుతున్నాను. పోనీ! నీ మనస్సులో ఏముందో చెప్పరాదా!" ఆవేదనగా అడిగేను.

"భాస్కర్! కొందరి జీవితాలు సాల్వ్ కాని ప్రాబ్లమ్స్‌లాంటివి. దానికి నేను ఏమని జవాబు చెప్ప

గలను... అది సరే గాని మీరు మరలా ఎప్పుడు వెడుతున్నారు వూరు" అని మాట మార్చింది.

"రేపు రాత్రి గోదావరి ఎక్స్ప్రెస్‌లో వెళ్ళిపోతున్నాను వీణా! నాకు ఇంకా చాలా పనులున్నాయి అక్కడ. అందుకే పద్మను, బాబును తీసుకొనిరాలేక పోయాను"...

ఇంతలో పందిట్లోనుండి మంగళవాద్యాలు వినిపించాయి.

"రండి టైం అయినట్లుగావుంది"... అంది లేస్తూ.

నేను కూడా అయిష్టంగానే లేచాను. కాని ఆమె నుండి నేను సరియైన సమాధానం తెలుసుకోనందుకు బాధపడ్డాను. అనాడే కాదు ఈనాడు కూడా ఆమె మనస్సులో ఏముందో తెలుసుకోలేకపోయాను. ఇటువంటి విచిత్రమైన వ్యక్తులను భగవంతుడు ఎందుకు సృష్టిస్తాడో అర్థంకాకుండా వుంది.

○ ○ ●

మర్నాడు రాత్రి.

గోదావరి ఎక్స్ప్రెస్ ప్లాట్‌ఫారంమీద రెడీగా వుంది బయలుదేరడానికి. ట్యూబ్‌లైట్ల వెలుగులో పట్టపగలులా వుంది సికింద్రాబాద్ స్టేషన్.

చక్రవర్తి నిష్ఠూరంగా మాట్లాడుతున్నాడు, వచ్చి రెండు రోజులుకూడా వుండకుండా వెడుతున్నందుకు.

"నీకు తెలియదు నాకు చాలా పనులు వున్నాయి. మరోసారి వీలును చూసుకొని నీదగ్గర ఒక వారం రోజులు అయినా వుంటానుగా" అని మాట్లాడుతున్న వాడిని ఒక్కసారి ఆగిపోయాను. 'వీణ' ఒకో కంపార్ట్‌మెంట్ చూసుకుంటూ వస్తోంది.

గార్డ్ విజిల్ వూది పచ్చదీపం చూపిస్తున్నాడు. ట్రైన్ కూడా కూత వేసింది.

"వీణా" బిగ్గరగానే అరచేను.

పరిగెత్తినట్లుగానే దగ్గరకు వచ్చింది.

"ఏమిటిలా వచ్చేవు?"

ప్రక్కనే వున్న చక్రవర్తిని చూసి ఆగిపోయింది

"నిన్న రాత్రి మీరు అడిగేరే ఒక ప్రశ్న దానికి సమాధానం ఇందులోవుంది" అంటూ బరువైన కవరు అందిస్తూ "ఇదిగో పెళ్ళికి మీరు పిలవకపోయినా ఇది నా ప్రజంటేషన్"... అంటూ లేత గులాబిరంగు కాగితంతో చుట్టిన వస్తువు ఒకటి చేతిలోపెట్టింది.

"ఏమిటిది వీణా!" అని అడిగేలోపల రైలు కదిలింది.

"పద్మను అడిగేనని చెప్పండి. బాబుకు నా ముద్దులు" అంది.

"అలాగే వస్తాను వీణా! ఒక క్షణం మాట్లాడుకునే టైం కూడా లేదు"... అంటూ రైలు ఎక్కేను.

కంపార్ట్‌మెంట్‌లో నిలబడి బరువుగా చెయ్యెత్తి వూపేను. వీణ కళ్ళు తుడుచుకుంటూ నెమ్మదిగా చెయ్యి వూపింది.

వీణ రాసిన ఉత్తరం చదవసాగాను.

"భాస్కర్,

ఈ ఉత్తరం చదివినతరువాత అయినా నామనస్సులోని బాధను మీరు గ్రహించగలరు. నోటితో చెప్పలేని విషయాలు కాగితంద్వారా తేలికగా చెప్పుకోగలం. ఎన్నాళ్ళనుండో నామనస్సులో దాచుకున్న విషయం ఈ నాడు మీకు చెప్పుకుంటే నామనస్సులో కొంత భారం తగ్గుతుంది.

మిమ్మల్ని నేను మనస్ఫూర్తిగా ప్రేమించి, ఆరాధించిన మాట వాస్తవమే. ఆ ఆరాధనలో అప్పుడే కాదు ఇప్పుడుకూడా ఏమి తక్కువకాలేదు. ఒక నాడు మీరువచ్చి వీణా నేనునిన్ను పెళ్ళిచేసుకుంటాను. అని అన్నప్పుడు నేను పొందిన ఆనందం వర్ణనాతీతం. నా అదృష్టానికి నేను ఎంతో పొంగిపోయాను. కాని అది ఆ సమయంలో మీ ముందు వెల్లడి చేయలేక

పోయాను. అందుకు కారణం చెప్పితే మీరు ఇప్పుడు ఎంతో బాధపడవచ్చు. కాని ఇప్పుడు చెప్పకతప్పదు.

ఆవేళ నాపుట్టినరోజు. మీకు చెబుదామని మీకోసం ఉదయం ఎనిమిది గంటలకు మీరు వుంటున్న ఇంటికి వచ్చేను. ముందుగదిలో మీరు మీ నాన్నగారు నాగురించే మాట్లాడుకోవడం విని ఆగిపోయాను.

"అయితే అమెనెవ్వరినో పెళ్ళి చేసుకుని మన వంశం మంట కలుపుతానంటావు అంతేనా. అలా జరగడానికి వీలులేదు. నాబొందిలో ప్రాణం వుండగా ఇది జరగనివ్వను. ఏమైనా ఇప్పుడు నేను తెచ్చిన సంబంధం నీవు చేసుకొనితీరాల్సిందే" అన్నారు.

"నాన్నా! మీ పట్టుదల మీదేగాని నామాట విని పించుకోరేం. 'వీణ'ను చూస్తే మీరు అలా అనలేరు... నేను ఆమెనే చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. నా నిర్ణయానికి తిరుగులేదు. ఇకపోతే ఆమెకులంతో నాకు పట్టింపులేదు"...

"భాస్కర్" అంత ఆవేశమూ ఆయనలో ఒక్క సారిగా చల్లారి పోయింది. ప్రాధేయ పూర్వకంగా అడుగుతున్నారు. "నీకు తెలియదు బాబు, ఇప్పుడు నేను తెచ్చిన సంబంధం కాదంటే మనం నలుగురిలో తలెత్తుకుని తిరగలేం. నీతండ్రి పరువు, ప్రతిష్ఠ కాపాడే బాధ్యత నీమీదే వుంది. బాగా ఆలోచించుకో.

మీరు ఏమి మాట్లాడకుండా విసురుగా బయటకు వస్తున్నారు. నేను మీకు కనిపించకుండా తప్పు కున్నాను. అప్పుడు మీరు నన్ను చూడ లేదు. కాని మీవెనకాలే వస్తున్న మీ నాన్నగారు నన్ను చూచి ఆగి పోయారు.

"ఎవరమ్మా నీవు, ఎవరు కావాలి" అని అడిగేరు.

నేను కొద్ది క్షణాలు వరకు ఏమి మాట్లాడలేదు. నాలో అప్పుడు తెలియని ఆవేశం వచ్చింది. నావలననే కదా తండ్రీ కొడుకులు ఇద్దరు అలా ఆవేశపూరితు లవుతున్నది అని అనిపించింది. అందుకే ఒక నిర్ణ యానికి వచ్చిందానిలా

"నేనేనండి 'వీణ'ను" అన్నాను తలవంచుకొని.

"నీవా! రా అమ్మా అలా కూర్చో" అన్నారు లోపలికి దారితీస్తూ.

నేను ఆయనవెంట లోపలకువెళ్ళి కూర్చున్నాను.

"చూడమ్మా! మా మాటలన్నీ నీవు వినేవుంటావు. కాని నిన్ను చూస్తుంటే నీకు అన్యాయంచేస్తున్నా నని పిస్తోంది. కాని అవతల నేను నలుగురిలో మాట ఇచ్చేను. అందుకు ఒక్కటే నేను కోరుకునేది. మావాడి విషయంలో నీవు త్యాగంచేయక తప్పదు తల్లీ. వాడి మనస్సు ఎలాగైనా నీనుండి దూరమయ్యే టట్లు చేయి. ఇది పాపమే అనుకో!...కాని నీవే ఈ బాధనుండి తప్పించగల దానవు ... ఇవి చేతులు కావనుకో!"

"వద్దండి అంతమాట అనవద్దు. మీరు పెద్దలు. అసలు మా ఇద్దరి మధ్య ఎప్పుడూ పెళ్ళిప్రశక్తి రానే లేదు. మీ అబ్బాయి మనస్సు మార్చి మీకే అతనిని అప్పచెబుతాను సరేనా వస్తానండి సెలవు" అంటూ ఆయనకు నమస్కారం చేసి బయటకు వచ్చివేసాను.

కాని ఆసమయంలో నేను ఎంత పొరపాటు పని చేశానో తలచుకొని ఈ నాటికి కుమిలిపోని క్షణం అంటూ లేదు. నాహృదయంలో రగిలే మంటలు బల వంతాన అణచుకుని ఆనాడు మీముందు ఏమి తెలియని దానిలా వుండటానికి నేను ఎంత ప్రయత్నం చేసానో ఆ భగవంతునికే తెలియాలి.

ఆదేరోజు సాయంత్రం మనం పార్కులో కలుసు కున్నపుడు నేను అనుకున్నట్లుగానే "మీరు పెళ్ళి విషయం ఎత్తగానే 'నాకు అటువంటి అభిప్రాయం ఏమి లేదు' అని మీ మనస్సును గాయపరిచేను. నిజంగా ఆనాడు ఆమాట మీతో చెప్పడానికి నేను ఎంతబలం

తెచ్చుకున్నానో నాకే అర్థంకాదు. కాని మీరు నన్ను వేరే విధంగా తలంచి నాకు దూరం అవడానికి ప్రయత్నం చేసారు.

మీ ముందు నేను ఇక కనిపించలేక ఆ మర్నాడే ఆఫీసుకు రెండు నెలలు మెడికల్ లీవు పెట్టి, సెలవు అయిన తర్వాత నేను తిరిగి ఆఫీసుకు రాగానే తెలిసిన విషయం, మీరు రిజైన్ చేసి వెళ్ళి పోయారని. ఆవిషయం వింటూనే నేను కూలి పోయాను.

జీవితంలో మీరు నాముఖం చూడరని తలపోసే దాన్ని. కాని ఏనాటికైనా ఈ నిజం మీకు చెప్పి నాపై మీకున్న అపోహను తొలగించాలని నేను ప్రతి క్షణం ఎదురు చూసేను. భగవంతుడు నా ప్రార్థన విన్నాడు. మీరు దైవికంగా నిన్న మా చెల్లెలు పెళ్ళికి రావడం జరిగింది. భా స్క ర్! మిమ్మల్ని అంత మందిలో వున్నా క్షణంలో గుర్తించ గలిగేను...ఎప్పుడు మీతో మాట్లాడటానికి సమయం దొరుకుతుందా అని ప్రతి నిముషం ఆలోచించేను. అసలు రాత్రే మీకు ఈ విషయాలన్నీ చెప్పాలని అనుకున్నాను. కాని ధైర్యం చాలలేదు.

భాస్కర్! ఇప్పటికైనా నా హృదయాన్ని మీరు అర్థం చేసుకుంటె అంతేచాలు.

హృదయ మనేది ఒక నది అయితే, అందులో కెరటాలే ఈ మమతానురాగాలు. అవి నదిని విడిచి ఎక్కడకుపోవు, పోలేవుకూడా. ఎప్పుడైనా నేను మీ మనస్సులో మెదిలితే అంతేచాలు నాకు ... ఎంత దూరంలోవున్నా మీ ఆనందాన్ని, సుఖాన్ని, కాంక్షిస్తూ!

మిమ్మల్ని మరువలేని
మీ "వీణ"

ఆ ఉత్తరం పూర్తిచేయగానే నాకళ్ళముందు వున్న తెరలన్నీ తొలిగిపోయాయి. ఎంతపనిచేసావు వీణా అని నామనస్సు మూగగా రోదించింది.

వీణ ఇచ్చిన ప్రజంటేషన్ ఆతృతగా విప్పి చూసేను. "నదిలో ఎక్కడో దూరంగా ఒక పడవ. గట్టున నిలబడి చూస్తున్న ఒక యువతి". నిర్మల్ పైటింగ్ అది.

* * *

కన్నుల కాంతులు కలవల చేరెను
మేలిమి జేరెను మేనిపసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ

—గురజాడ